# గతితప్పని చరిత్ర

వేములపల్లి మోహనరావు
పి.వి.కృష్ణారావు



నేను లోపలి కెళ్ళేప్పటికి నల్లరెడ్డిగారెవరితోనో అనర్గళంగా మాట్లాడేస్తున్నారు. బయట మండిపోయే ఎండలో నుండి ఆ ఏసీ రూలో అడుగు పెడుతూనే, అగ్నిహోత్రావధాన్లును తప్పించుకుని మధురవాణి ఒళ్ళోపడిన గిరీశంలా ఫీలయిపోయాన్నేను.

పందిరిమంచంమీద బాసింపట్టు వేసు కూర్చుని సుదీర్ఘమైన ఉపన్యాస మిస్తున్నారాయన. ఎదుటి వ్యక్తి పెద్ద హీరో ముందు చిన్న న్యాతలా అతి జాగ్రత్తగా వింటున్నాడు. జేబు రుమాలుతో మొహం తుడుచుకుంటున్న నాకు పక్కనే ఉన్న ఫిడ్జ్ చూపించి ఆ చేత్తోనే కూర్చోమని సైగచేశారు. చల్లటి నీళ్ళు కాసిని గొంతులో పోసుకుని మెత్తని ఆ సోఫాలో కూలబడగానే ప్రాణం ఎక్కడికో తేలిపోయింది. ఏదో తెలియని మగత నన్నావహించి, రెడ్డిగారూ, ఆయన విక్టిమ్, ఇద్దరూ శూన్యంలోకి క్రమక్రమంగా జారిపోయారు.

అలా ఎంతసేపు గడిచిందో, రెడ్డిగారు నా భుజం పట్టుకుని కుదిపేవరకూ మెలకువ రాలేదు.

'ఏం వంతులూ. మంచి ఎండన పడి వచ్చావ్ పాపం. వడదెబ్బ కొట్టినట్టుంది. కొంచెం గ్లూకోజ్ **తాగుతావా**' అంటూన్నారాయన.

'అబ్బే వద్దండీ. బస్టాండ్ నుంచీ నడచివచ్చేసరికి బాగా నీరసం వచ్చేసింది. ఫర్వాలేదు. ఇప్పుడు బాగానే ఉంది.' అన్నాను నిటారుగా కూర్చుంటూ. అప్పటి వరకూ రెడ్డిగార్ని భరించిన ఆసామీ వెళ్ళిపోయినట్టున్నాడు. గది ఖాళీగా ఉంది.

'అవును మరి. ఈ వెధవ ఊళ్ళో రిక్షాలు కూడ దొరికిచావవు. ఇంతకీ ఏం పనిమీద వొచ్చావ్.

'పనంటే పెద్ద పనేంకాదు. ఊరికే ఓసారి మీకు కనబడిరమ్మన్నారు నాన్నగారు.' అన్నాను కొంచెం సంశయిస్తూ.

'ఊ....' అన్నారాయన సాలోచనగా. 'నీ బి.ఏ. అయిపోయిందనుకుంటాను పోయిన సంవత్సరం.'

అవునన్నట్టు తలూపాను. ఇప్పుడేం చేస్తున్నావు మరి అని ఆయన నన్నడగలేదు. అడక్కుండానే ఆయనకు తెలుసు, నేనేమీ చేయడంలేదనీ, ఏదైనా చేస్తూ ఉన్నట్టయితే మా నాన్నగారి పేరు చెప్పుకుని ఈ మిట్టమధ్యాహ్నపు వేళ తనముందు చేతులు నలుపుకుంటూ కూర్చోననీ.

'మీ తమ్ముడూ, చెల్లెలూ బాగున్నారా. స్కూలు కెళ్తున్నారా!'

మళ్ళీ తలూపాను.

'మీ నాన్నగారి ఆరోగ్యం ఎలా ఉంది? డాక్టర్ దగ్గరకు వెళ్తున్నాడా! మందులవీ తీసుకుంటున్నాడా?' అడిగారాయన.

నేనేం మాట్లాడలేదు. తల వంచుకు కూర్చున్నాను. రెండు క్షణాలు నిశ్శబ్దం

'ప్చ్. తనకుఅభిమానం చాలా ఎక్కువ. దాంతోనే దెబ్బతిన్నాడు మనిషి.' అన్నారు సానుభూతిగా.

నోరు తెరవబోయి ఆగిపోయాను. ఇది సమయం కాదు. ఇది ప్రదేశంకాదు. సందర్భం అసలేకాదు. లేకపోతే పాతికేళ్ళు కుక్కకన్నా విశ్వాసంగా ఈ ఇంటిని కాచిన ఆ సాధుజంతువుమీద

దొంగతనం మోపి పనిలోంచీ తీసివేసిన మనిషి దగ్గరికి నేను పొట్ట చేత్తో పట్టుకుని రావడం నా దౌర్భాగ్యంకాక మరేమిటి? దానికి తోడు మళ్ళీ పౌరుషం ఎందుకు నాకు! వివాదాలూ, సంజాయిషీలూ, క్షమాపణలూ ఎందుకు! ఇవన్నీ నా తండ్రి క్షోభను తగ్గించగలిగాయా! ఆయనకు పక్షవాతం రాకుండా ఆప గలిగాయా!

'నాదే తప్పులేవయ్యా, మర్చిపో, మళ్ళీ ఉద్యోగంలో జేరూ అని గడ్డాలూ, చేతులూ పట్టుకుని బతిమాలాను అనాడు. విన్నాడా మరి! చేజేతులా తన పిల్లల భవిష్యత్తును నేలపాలు చేశాడు.'


ఆ విషయంమీద చర్చ నాకు గిట్ట దన్నట్టు అసహనంగా అటూ ఇటూ కదిలాను. ఆ సహాయాలు అంతకుమించి, అసమ్మతిని తెలియజెయ్యలేరు.

మళ్ళీ కాసేపు మౌనం మా మధ్య.

'భోంచేద్దాం రా' అన్నారాయన స్టీల్ కారియర్ విప్పుతూ.

వద్దనే అవకాశం లేదు నాకు. ఆకలి అన్నిటికన్నా పెద్ద అవసరం.

చేతులుకడుక్కొని రావడానికి లేచాను. ఆ గదిలోనే ఉన్న ఎటాచ్‌డ్ బాత్‌రూం చూపించారాయన. తలుపు తెరుచుకుని లోపలి కడుగుపెట్టబోతూ, షాక్ తిన్న ట్టయి, మళ్ళీ వెంటనే తలుపు మూసి వెనక్కి తిరిగి వచ్చేశాను. నేను చూసిన అరక్షణం దృశ్యం నా ఒళ్ళు జలదరింప జేసింది. లేదా అది పులకింతో మరి రెంటికీ తేడా తెలిపే మనసు లేదు నాకు. ఇంకా నయం, ఆ అమ్మాయి అటు తిరిగి ఉండబట్టి సరిపోయిందిగానీ, లేకపోతే పాపం ఎంత సిగ్గుపడిపోయేదో. ఇంతకీ ఎవరామె. రెడ్డిగారి భార్య కాదు. ఆవిణ్ణి అంతకు ముందోసారి చూశాను. దర్బారు నడపబోతున్న పట్టమహిషిలా ఉంటుం దామె, గంభీరంగా, రాజఠీవిలో. మొగుడూ




పెళ్ళాలిద్దర్నీ పక్క పక్కనే చూస్తే రంభా, రాక్షసుల్లా ఉంటారు.

'ఏం వచ్చేశావేం' అన్నారాయన పొడిగా ఉన్న నా చేతుల్ని చూస్తూ. ఏమని చెప్పాలి, ఎలా చెప్పాలి. విచిత్ర మైన సంకట స్థితిలో పడిపోయాను.

'ఏమిటయ్యా అలా నీళ్ళు నము ల్తావ్....'

'అది కాదండీ. లోపల ఎవరో ఉన్నారు....'

'లోపల ఎవరో ఉన్నారా....' క్షణం ఆలోచించి గట్టిగా నవ్వేశారు.

'భలే వాడివయ్యా పంతులూ. నాతికీ రాతికీ తేడా తెలియనివాడివి నువ్వేం మగాడివయ్యా. అది ఒట్టి బొమ్మ మాత్రమే. వెళ్ళి మళ్ళీ చూడు.'

నా చెవుల్ని నేనే నమ్మలేకపోయాను. బాత్‌రూం తలుపు తెరిచిన నాలో మళ్ళీ అదే గగుర్పాటు. టబ్ వైపు తిరిగి టవల్‌తో ఒళ్ళు తుడుచుకుంటున్న భంగిమలో ఉన్న ఆ నిలువెత్తు ఆకృతి కేవలం ఓ బొమ్మా! మరి ఆమె ఒంటి మీద మెరిసే ఆ నీటిచుక్క లేమిటి! మైగాడ్! ముట్టుకుని చూశాను. చల్లని ఆ స్పర్శకు నాకు ఒళ్ళు ఝల్లుమంది. గబగబ చేతులు కడుక్కొని బయట పడ్డాను. ఉన్నవారి అభిరుచులు ఇంత విభిన్నంగా, విచిత్రంగా ఉంటాయా!

మౌనంగా భోంచేస్తున్న నన్ను రెడ్డి గర్వంగా చూశారు. నాలాంటి ఎందరు అటువంటి స్థితిలో ఇరుక్కొన్నారో అంతకుముందు!

'కంగారుపడ్డావ్ కదూ. అది మా సైట్ ఇంజనీర్ ఐడియా! గొప్ప రసికుడులే వాడు. ఆ బొమ్మ చెక్కించ డానికెంత ఖర్చయిందో తెలుసా....లక్షా పదమూడు వేలు.'

నాకు ముద్ద మింగుడు పడలేదు. తమ అభిజాత్యాన్ని చాటుకోవడానికి గొప్ప వారికా మొత్తం ఓ లెక్కలోకి కాదు కాబోలు.

భోజనం పూర్తయ్యాక పడుకున్న రెడ్డిగారు నాలుగింటిగ్గానీ లేవలేదు. అప్పటివరకూ నేనేవో మాగజైన్లు తిరిగేస్తూ, దూరంగా కడుతున్న డామ్ మీద కీటకాల్లా తిరిగే కూలీల్నీ, గొంగళి పురుగుల్లా పాకే బుల్‌డోజర్లనీ చూస్తూ గడిపాను.

కాఫీలు వచ్చాయి. అవి పూర్తయ్యాక 'అలా టౌను వైపు వెళ్ళొద్దాం పదవయ్యా' అన్నారాయన బట్టలు మార్చుకుంటూ. లేచి నిలబడ్డాను.

మమ్మల్ని చూడగానే డ్రైవర్ డోర్ తెరిచి పట్టుకున్నాడు. పాత మోడల్ బ్యూక్ కారు అది. నల్లరెడ్డిగారి రంగుతో పోటీ పడుతూ మిలమిల మెరుస్తోంది.



నేను ముందు సీట్లో కూర్చున్నాను. గతుకుల రోడ్డును హంసలా వయ్యారంగా అధిగమించి తారురోడ్డెక్కింది కారు.

'నీకు టైపు వచ్చా పంతులూ.'

'వచ్చండీ. హైయర్ పాసయ్యాను. షార్ట్‌హాండ్ కూడా లోయర్ పాసయ్యాను.

'మంచిది. అవి లేకపోతే ఉద్యోగం దొరకడం కష్టం ఈ రోజుల్లో.

కారు నీళ్ళలో పడవలా, కుదుపులు లేకుండా మెత్తగా సాగిపోతోంది.

పదిహేను నిమిషాల తర్వాత అన్నారు రెడ్డిగారు.

'వచ్చేవారం రావయ్యా అయితే.... ఆ.... మంచిది చూసుకుని.... పన్లో జేరుదువుగాని.... కానీ వచ్చే ముందు మాత్రం, మీ నాన్ననుంచీ ఏమైనా సంక్రమించిందేమో నీ కూకాడా వల్లమాలిన అభిమానం లాంటిది....దాన్ని కాస్త ఇంట్లోనే అట్టిపెట్టిరా. బయట ఒకరి కింద పనిచేస్తున్నప్పుడు, అందులోనూ నా లాంటి చదువురాని మోటువాడి కింద, కాస్త ఒడిదుడుకులూ, మాట జారడాలూ ఉంటాయి. సర్దుకుపోగలిగితేనే రా. ఆది నిష్టూరం మేలని చెబుతున్నాను.'

నా మొహం జేవురించింది. అంగీకార సూచకంగా తలూపాను. అసంకల్పిత ప్రతీకార చర్య అది. బహుశా, నా జీవితంలో జీర్ణించుకుపోయిన అవసరాలు చేయించి ఉంటాయా పని.

టౌన్ చేరుకున్నాం. కారు మార్కెట్లోంచీ వెళ్తుండగా 'ఒరేయ్.... ఆపాపు' అన్నారు రెడ్డిగారు. పేవ్‌మెంటు మీద కూర్చున్న ఓ బక్కచిక్కిన ముసలివాణ్ణి ఇటు రమ్మని సైగ చేశారు. వాణ్ణి చూస్తూనే నాకు కడుపులో దేవినట్లైంది. వెన్నెముక నానుకుని పొట్ట, ఎముకల్ని చర్మంతో కుట్టిన అస్థిపంజరంలా శరీరం, లోతుకుపోయిన కళ్ళు, ఎండి అట్టలుకట్టుకుపోయిన జుట్టు. దారిద్ర్యాన్ని ఎవరూ నిర్వచించనక్కర్లేదు. వాణ్ణి నిదర్శనంగా చూపిస్తే చాలు.

విమానమంత కార్లోంచి, పెద్దమనిషి తనను చెయ్యెత్తి పిలిచేసరికి అది కలో నిజమో తెలియనట్టు కాసేపు కదలకుండా ఉండిపోయాడు వాడు, కించిత్తు విషాదమైన చిరునవ్వు పెదాలమీద పులుముకుని.

'ఒరేయ్. నిన్నేరా.... చెవుడా.... వినబడ్డంలేదా!' రెడ్డిగారు గట్టిగా అరిచేసరికి, వాడికి ఆయన పిలిచేది తననేనని నిర్ధారణ అయిపోయింది. ఆజ్ఞలూ అరుపులూ, అధికారాలూ భరించడం వాడికి ఊపిరంత సహజం అయినట్టు మెల్లిగా లేచి కారుదగ్గరకు వచ్చి నిలబడ్డాడు, చేతులు కట్టుకుని.

'ఎంత కిస్తావ్‌రా ఆ చాపలు' అడిగారు రెడ్డిగారు.

ఆయనకు పిచ్చెక్కిందో, తనకు మతిభ్రమించిందో తెలియనట్టు కాసేపు మౌనంగా ఉండిపోయాడు వాడు.

'వినపడదా ఏమిట్రా చెవిటి ముండాకొడకా! మాటాపలుకూ లేకుండా ఏమిటా వెర్రి చూపు!' చిరాగ్గా అన్నారాయన.

'చిత్తం దొరా. సరుకు నాణెం చూసి తవకి తోసినంతిప్పించండి.'

వాడి గొంతు వేయి నిలువుల లోతు. వెనక్కి పరుగెత్తికెళ్ళి ఆ ఈతాకులతో అల్లిన మూడు పెద్ద చాపలూ కారు దగ్గరికి పట్టుకొచ్చేశాడు.

'ఖరీదెంతో చెప్పరా ముందు'. అసహనంగా అన్నారాయన.

'మూడు రోజులు పట్టింది బాబూ ఈట్ని అల్లడానికి. దర్మప్రబువులు. తవకి తెలియందేవుంది.'

'ఎంత ?'

'ఒకోటి ఏడు రూపాయలు చేసుకోండి'

నల్లరెడ్డిగారి మొహం మరింత మాడిపోయింది.

'ఏమిట్రోయ్. ఈ మూడింటితోనే మేడలు కట్టేద్దామనుకుంటున్నావేమిటి ? అమ్మే ధర చెప్పు.'

వాడు మరింత వంగిపోయాడు. 'లేదు బాబయ్యా.... మూడు రోజుల్నుంచీ ఒక్క బేరం కూడా లేదు. లంకణాలుంటున్నామండయ్యా. తవరు కొనాల. ఇయ్యాలైనా మేవింత గంజినీళ్ళు తాగాల.'

రక్తాన్ని చెమటగా మార్చి శ్రమించేవాడు తన కష్టఫలాన్ని అమ్ముకోవడానికి అడుక్కోవలసి రావడం, ఇంకోడి

కాళ్ళు పట్టుకోవలసిరావడం మన దేశం లోనే చెల్లు.

'నువ్వు పోనీరా' అన్నారాయన డ్రైవర్‌తో. కానీ అతను స్టార్ట్ చెయ్యలేదు.

'బాబ్బాబు. మీకు తోసినంతిప్పించండి. ఆకలికి మాడి సచ్చిపోతన్నాం.' అన్నాడు వాడు చేతులెత్తి దణ్ణంపెడుతూ.

'ఒకోటి రెండు రూపాయలకన్నా ఎక్కువ చెయ్యదురా.' అన్నారాయన.

కత్తితో తలనుండీ కాలివరకూ ఒక్క వేటున తెగనరికినట్లయింది. వాడికాదు ....నాకు.


'ఆటి ఇలవ మీక్కాదు బాబూ, రెక్కలు ముక్కలు సేసుకుని అల్లే మాకు తెలుసు. అవసరం మాది గనక తమరిలాంటోరు ఆటికెంత విలువగడితే అంతే మేమూ ఒప్పుకోవాల.'

'ఏడిశావ్ లేరా. ఇంతకీ నీది అమ్మే బేరమేనా. మూడిటికీ ఏడు రూపాయలిస్తాను. ఇస్తే ఇవ్వు. లేకపోతే లేదు.

'పది రూపాయలైనా ఇప్పించండి... నాలుగురోజుల కష్టం....'

'ఇంకో అర్ధరూపాయి చేసుకో. ఇక అంతే.... పైసా కూడా ఎక్కువివ్వను. పర్స్ తీసి ఏడున్నర లెక్కపెట్టి వాడి దోసిట్లో పెట్టారు రెడ్డిగారు. డ్రైవర్ డిక్కీ తెరిచి చాపల్ని అందులో పెడుతున్నాడు.

ముసలాడు తన డబ్బులు ఎవరో లాక్కుపోతారన్నట్టు గుప్పిట మూసేశాడు. 'దోసుకోండి బాబూ. నాలాంటోడి కష్టం దోసుకోకపోతే మీలాంటోళ్ళకి ఈ కార్లూ, మిద్దెలూ, పట్టు పంచెలూ, పరమాన్నాలూ ఎట్లా దొరుకుతాయి. తవరిచ్చిన ఈ బిచ్చం డబ్బుల్తో ఈ బొందిలో దీపాన్ని ఆరిపోకుండా ఇంకాసింత నూనెపోసి మళ్ళీ



తవర్లాంటి ఇంకో దర్మాతుడికోసం నేను నాల్రోజులు తిండీ నిద్రా మాని సాపల్లొద్దా....దోసుకోండి దోసుకోండి....' దాదాపు ఏడుపు గొంతుతో అనేసి వెళ్ళిపోయాడు వాడు.

రెడ్డిగారికి ఆ మాటలు వినబడలేదో, వినబడీ ఆయన్ని కదిలించలేకపోయాయో దేవుడికే తెలియాలి.

కారు కదిలింది.

'మన దక్షిణం పక్కన కేంప్‌లో వేయించరా వాటిని. లారీ డ్రైవర్లూ వాళ్ళూ పడుకోవడానికి పనికొస్తాయి.' అన్నారాయన. డ్రైవర్ తలూపాడు.

ఫైవ్ స్టార్ హోటల్ ముందు పార్కింగ్ లాట్‌లోకి కారు సర్దుకుంది.

ఆ కారుకు లీటర్ పెట్రోల్ రెండున్నర మైళ్ళు మించిరాదు.

లీటరు పెట్రోలు ధర అయిదున్నర.

టౌన్‌కీ, డాం సైటుకూ మధ్య దూరం నలభై మైళ్ళు.

ఓ పండు ముసలివాడి నాలుగురోజుల కష్టం విలువ ఏడున్నర రూపాయలు.

నా పిడికిళ్ళు అప్రయత్నంగా బిగుసుకున్నాయి.

'సరే పంతులూ. ఇక ఉంటాను మరి. మళ్ళీ కలుద్దాం' అన్నారాయన.

'అక్కర్లేదు.' అన్నాను గట్టిగా. నా గొంతు నాకే భయం కలిగించింది.

ఆశ్చర్యంగా చూశారాయన.

'అదేం....' ఆయన ప్రశ్నార్థకం ఇంకా పూర్తికానేలేదు.

'నేను మనుష్యుల దగ్గర మాత్రమే పనిచేస్తాను' అన్నాను.

ఆయన రియాక్షన్ చూసే అవసరం, అవకాశం నాకు లేవు. వడివడిగా ముందుకు నడిచాను.